కుత్బుల్లాపూర్‌లో 50.19 శాతం పోలింగ్

- నాగులూరులో అత్యధికంగా 80.31%
- బాచుపల్లిలో అత్యల్పంగా 28.10% ఓటింగ్

కుత్బుల్లాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో 50.19 ఓటింగ్ శాతం నమోదయింది. నియోజకవర్గంలో మొత్తం 7,24,992 మంది ఓటర్లుండగా, వారిలో 3,78,362 మంది పురుష ఓటర్లు, 3,46,468 మంది మహిళా ఓటర్లు, 162 మంది ఇతరులు ఉన్నారు. వీరిలో 1,91,436 మంది పురుషులు, 1,72,390 మంది మహిళలు, 48 మంది ఇతరులతో కలిపి మొత్తం 3,63,874 (50.19 శాతం) మంది ఓటు వేశారు. ఈ మేరకు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 57.19 పోలింగ్ శాతం నమోదైంది. పార్లమెంటు ఎన్నికల్లో 7 శాతం పోలింగ్ తగ్గింది.

అత్యధికం.. అత్యల్పం

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 590 (582 సాధారణ, 10 ఆగ్జలరీ) పోలింగ్ కేంద్రాలు ఉండగా నాగులూర్‌లోని మండల ప్రజాపరిషత్ పాఠశాలలోని 13వ పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 80.31 పోలింగ్ శాతం నమోదైంది. ఈ పోలింగ్ కేంద్రంలో మొత్తం 640 మంది ఓటర్లు ఉండగా వారిలో 514 మంది ఓట్లు వేశారు. అలాగే బాచుపల్లి రోడ్ నెంబర్-2 లోని సిల్వర్ ఓక్స్ పాఠశాలలోని 79వ పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 28.10 పోలింగ్ నమోదైంది. ఈ పోలింగ్ కేంద్రంలో మొత్తం 847 మంది ఓటర్లు ఉండగా కేవలం 99 మంది మాత్రమే ఓటు వేశారు.

స్ట్రాంగ్ రూంలోకి..

సోమవారం జరిగిన ఎన్నికల అనంతరం ఈవీఎంలను నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి కట్టుదిట్టమైన భద్రతతో సుచిత్రలోని లాయోలా కళాశాలలోని డీఆర్‌సీకి (డిస్ట్రిబూషన్ రిసెప్షన్ కేంద్రం) తరలించారు. నియోజకవర్గంలోని ఈవీఎంలన్నీ సోమవారం రాత్రి 9.45 గంటలకు డీఆర్‌సీకి చేరుకున్నాయి. అనంతరం అక్కడి నుంచి అర్థరాత్రి సుమారు 12.30 గంటలకు నియోజకవర్గ ఏఆర్వో పులి సైదులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు, రాజకీయ నాయకుల సమక్షంలో నియోజకవర్గ ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) కేంద్రమైన కీసరలోని హోలీ మేరీ కళాశాలకు ఎన్నికల అధికారులు తరలించారు. మంగళవారం తెల్లవారుజాము సుమారు 4.30 గంటలకు వాటిని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. అనంతరం ఉదయం సుమారు 6.30 గంటలకు సాధారణ పరిశీలకులు డాక్టర్ ప్రియాంకా శుక్లా, జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి (ఆర్వో)తో కలిసి వాటిని పరిశీలించి భద్రతా గదికి సీల్ వేశారు.


కౌంటింగ్ కేంద్రం వద్ద సంబంధిత పత్రాలను పరిశీలించి సంతకాలు చేస్తున్న సాధారణ పరిశీలకులు ప్రియాంక శుక్లా, జిల్లా కలెక్టర్, ఆర్వో గౌతం

గెలుపు, ఓటములపై చర్చ

దుండిగల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉత్కంఠంగా సాగిన లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు, ఓటములపై అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థుల అనుచరులు, సహచరులతో చర్చలు జరుపుతున్నారు. సోమవారం సాయంత్రం ఎన్నికలు ముగిసిన తరువాత అంతా ఒకచోట కూర్చొని ఎన్ని ఓట్లు పోలయ్యాయి, ఏయే ప్రాంతాల్లో ఎవరెవరికి ఎన్ని ఓట్లు పడ్డాయనే విషయంపై నాయకులు చర్చలు జరిపుకున్నారు. ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల నాయకులు ఏ డివిజన్‌లో ఎవరికి ఎన్ని ఓట్లు పడ్డాయి. ఎవరెవరు పార్టీ కొరకు ఎంత శ్రమించారో అనే విషయంపై కార్యకర్తలను ఆరా తీస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే మల్కాజిగిరి లోక్ సభ పరిధిలో కొన్ని అసెంబ్లీ నియోజవర్గాల్లో ఓటింగ్ శాతం పెరిగింది. మరికొన్ని సెగ్మెంట్లలో ఓటింగ్ తగ్గింది. అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఓటర్లు రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో బీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కట్టారు. కుత్బుల్లాపూర్లలో ఏ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు పడ్డాయనేది ఏ ముగ్గురు వ్యక్తులు కలిసిన ఇదే చర్చ కొనసాగుతోంది.


సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

సగర సంఘ అభివృద్ధికి కృషి చేస్తా: ఈటల

పేట్‌బషీరాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపల్‌లోని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ జయంతి కార్యక్రమంలో మాజీమంత్రి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవులకు మూలాధారమైన నీటిని దివి నుంచి భువికి తెచ్చినది భగీరథుడేనని మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్మన్ సన్నా శ్రీశైలంయాదవ్, బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మల్లారెడ్డి భగీరథ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ సగర సంఘానికి మంత్రిగా ఉన్నప్పుడు ఎంతో సేవ చేశానని, ఎళ్లవేళలా మీకు అందుబాటులో ఉంటానన్నారు.


స్వామివారి కల్యాణంలో ఆలయ కమిటీ సభ్యులు

పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం

పేట్‌బషీరాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్‌లోని ఆదర్శనగర్, సౌభాగ్యనగర్‌లో అలివేలుమంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి శ్రీకృష్ణ విగ్రహ ఫల, పుష్ప పూజలతో పాటు వేంకటేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.శంకరయ్య అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను ఊరేగించారు. బుధవారం ఉదయం మహాపూర్ణాహుతి, చక్రవారి అవబృధ స్నానం, శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ, సాయంత్రం ధ్వజారోహనం, సప్తావరణం వంటి కార్యక్రమాలు బుధవారంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.


సుందరకాండ హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, స్వామివారు

హనుమత్ వాహనంపై శ్రీనివాసుడి ఊరేగింపు

భెల్‌కాలనీ, మే14 (ఆంధ్రజ్యోతి): హనుమత్ వాహనంపై సతీసమేతుడైన శ్రీనివాసుడి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర, యోగేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిత్యపూజతో పాటు, అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను హనుమత్ వాహనంపై అలంకరించి దేవాలయ ప్రాంగణంలో ఊరేగించారు.

ధర్మపురి క్షేత్రంలో 19న త్రిమూర్తుల కల్యాణం

మియాపూర్, మే14 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ మదీనగూడలోని శ్రీధర్మపురి క్షేత్రంలో ఈనెల 19న త్రిమూర్తుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు క్షేత్రం నిర్వాహకులు సత్యవాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్షేత్రంలో త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల కల్యాణకారకం, సృష్టికర్త అయిన బ్రహ్మకు సరస్వతి అమ్మవారితో, కల్యాణ వెంకటేశ్వరస్వామికి పద్మావతి అమ్మవారికితో, దుర్గామల్లేశ్వర స్వామికి భ్రమరి దుర్గాంబికతో ఆదివారం ఏకాదశి పర్వదినం సందర్భంగా త్రిమూర్తుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు.

టెట్ అభ్యర్థులకు టి-సాట్ మెలకువలు

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించే టెట్ (టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు మెలకువలు తెలియజేసేందుకు టి-సాట్ ప్రత్యేక ప్రసార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని టిసాట్-సాఫ్ట్ నెట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈనెల 15 నుంచి నాలుగు రోజులపాటు ఐదు సబ్జెక్టులపై అనుభవంగల ఉపాధ్యాయులచే ప్రత్యేక లైవ్ కార్యక్రమం ఏర్పాటు చేశామని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. టి-సాట్ నిపుణ చానల్‌లో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు మెలకువలతోపాటు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 15న సైకాలజీ, 16న టీచింగ్ మెథడ్స్, 17న తెలుగు, 18న ఫిజికల్ సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులపై కొనసాగే ప్రసారాలు నిపుణ చానల్‌లో, టి-సాట్ విద్యా చానల్‌లో మరుసటి రోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు పునఃప్రసారమవుతుందన్నారు. ఇప్పటికే టెట్ అభ్యర్థుల కోసం సుమారు 200 ఎపిసోడ్స్ టి-సాట్ డొమైన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. అభ్యర్థులు తమ సందేహాలు- సమాధానాల కోసం 040-35403 26/726, టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 4039 నంబర్లకు కాల్ చేయవచ్చన్నారు.

హెచ్‌సీఏ ఎథిక్స్ అధికారిగా ఈశ్వరయ్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఎథిక్స్ అధికారిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఈశ్వరయ్య నియమితులయ్యారు. మంగళవారం ఉప్పల్ స్టేడియంలో ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. హెచ్‌సీఏ కార్యదర్శి దేవ్‌రాజ్, ఉపాధ్యక్షుడు దల్జిత్ సింగ్, కోశాధికారి సీజే శ్రీనివాస్, ఈశ్వరయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.


ఈశ్వరయ్యతో హెచ్‌సీఏ కార్యవర్గ సభ్యులు

ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ఏర్పాటు చేయాలి

బర్కత్‌పుర, మే 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుల స్మారక భవనం, అధ్యయన కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రెండు ఎకరాల స్థలం కేటాయించాలని అఖిల భారత సర్వసేవా సంఘ్ (సర్వోదయ మండలి) జాతీయ అధ్యక్షుడు వెదిరే అరవింద్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు తొలుపునూరి కృష్ణగౌడ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సాయుధయోధుల పోరాట పటిమను నేటితరానికి అందించడానికి పాఠ్యాంశాలలో చేర్చాలని, అన్ని వర్సిటీలలో పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ట్యాంకబండ్‌పై సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు.

● ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

పేట్‌బషీరాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): అధికారుల సమన్వయ లోపం కారణంగా రద్దీగా ఉండే రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారాయి. కొంపల్లి మున్సిపల్‌లోని ఎన్‌హెచ్-44 రహదారి నుంచి బహదూర్‌పల్లి వరకు రోడ్డును వెడల్పు చేస్తున్నారు. రోడ్డు మధ్యలో డివైడర్‌ను కడుతున్నారు. ఈ రహదారి 24 గంటలు వాహనాలతో రద్దీగా ఉంటుంది. రోడుకు ఇరువైపుల ఉన్న విద్యుత్ స్తంభాలు అలాగే వదిలేశారు. దీంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, పాదాచారులు ఆందోళనకు గురవుతున్నారు.


ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

కుటుంబసభ్యులతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


మనవడుతో ఎమ్మెల్యే గాంధీ


మనవరాలుతో ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నెల రోజుల పాటు బిజీబిజీగా గడిపిన ప్రజాప్రతినిధులు పోలింగ్ పూర్తయిన తర్వాత కుటుంబసభ్యులతో సరదాగా గడిపేందుకు ఆసక్తి చూపించారు. గతేడాది నవంబర్ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మూడునెలల పాటు పాదయాత్రలు, ప్రచారాలు, రోడ్‌షోలు, సభలు, సమావేశాలతో క్షణం తీరికలేకుండా గడిపారు. పార్లమెంట్ ఎన్నికల హడావిడీలో బిజీగా గడిపారు. సోమవారం పోలింగ్ పూర్తికావడంతో కాస్త కుటుంబసభ్యులతో గడిపేందుకు సమయం కేటాయించారు. ఈ నేపథ్యంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం కూకట్‌పల్లి శేషాద్రినగర్‌లోని తన నివాసంలో మనవరాలు ఐరాతో సరదాగా గడిపారు. అదే విధంగా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సప్తగిరికాలనీలోని తన నివాసంలో మనవడు ఆర్యవీర్‌తో ఆడుకొంటూ సరదాగా గడిపారు.

- ప్రచారం అనంతరం సేద తీరిన ఎమ్మెల్యేలు

● కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే

మియాపూర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ గెలుపుకోసం అహర్నిశలు కృషి చేసిన కార్యకర్తలు, నాయకులు, పార్టీ అభిమానులకు పార్టీ ఎల్లపుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నెల రోజులుగా పార్టీ ఎంపీ అభ్యర్థి కోసం ప్రచారం చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

స్ట్రాంగ్‌రూంకు చేవెళ్ల సెగ్మెంట్ ఈవీఎంలు.. సెక్యూరిటీ పటిష్టం

గచ్చిబౌలి. మే14 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని శేరిలింగంపల్లి సెగ్మెంట్‌కు సంబందించిన ఈవీఎంలు మంగళవారం సాయంత్రానికి చేవెళ్లలోని స్ట్రాంగ్ రూంకు చేరాయి. సోమవారం జరిగిన ఎన్నికల సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మొత్తం 633 పోలింగ్ కేంద్రాలకు సంభందించిన ఈవీఎంలను అధికారులు గచ్చిబౌలిలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అధికారులు పోలింగ్ సిబ్బంది నుంచి స్వాధీనం పరుచుకున్నారు. వాటిని మంగళవారం ఉదయం భారీ బందోబస్తు నడుమ చేవెళ్లలోని స్ట్రాంగ్‌రూంకి తరలించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, ఎన్నికల నిర్వహణ అధికారి, జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ ఎన్నికలు సాఫీగా నిర్వహించడంలో పాటు ఈవీఎంలను పోలీసుల సమక్షంలో స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచి గదులకు సీల్ వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక్ మాట్లాడుతూ, అధికార యంత్రాంగం, పోలింగ్ సిబ్బంది మూడు రోజులుగా శ్రమించి ఎన్నికలు సజావుగా నిర్వహించినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.


స్ట్రాంగ్‌రూంకు సీల్ వేస్తున్న కలెక్టర్ శశాంక, అధికారులు

బొట్టుబిళ్లలతో మూడు భాషల్లో జైశ్రీరామ్

పంజాగుట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి): జంటనగరాలకు చెందిన మహిళా కళాకారులు ఉమెన్ ఆర్టిస్ట్ అసోసియేషన్ (డబ్ల్యూఏఏ)గా ఏర్పడ్డారు. తమలోని ప్రతిభతో వినూత్నంగా బొట్టుబిళ్లలతో తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో జై శ్రీరామ్ బోర్డును అందంగా తీర్చిదిద్దారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డబ్ల్యూఏఏ సభ్యులు బొట్టుబిళ్లలతో రూపొందించిన జైశ్రీరామ్ బోర్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 10లోని కాసుల పద్మావతి చిత్రకళా అకాడమీ నిర్వాహకురాలు కాసుల పద్మావతి, కొండాపూర్‌కు చెందిన ఆర్ట్ టీచర్ సూర్యకుమారి, బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఆర్ట్ టీచర్లు యోగలక్ష్మీ, ప్రతిభాదల్, తిరుమలగిరికి చెందిన డ్రాయింగ్ టీచర్ రజని మంచికంటి, సదాశివపేటకు చెందిన ఆర్ట్ టీచర్, రచయిత కోమలిలు ఒక బృందంగా ఏర్పడ్డారు. తమ ప్రాజెక్టుకు అయోధ్య అని పేరు పెట్టారు. గత నెల 19న 30 ×40 అంగుళాల బోర్డుపై తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో బొట్టు బిల్లలు ఉపయోగించి జైశ్రీరామ్ అని అందంగా రాశారు. తమ రోజు వారీ పనులు చేసుకుంటూ 12 రోజుల పాటు రోజుకు ఐదు గంటలు వెచ్చించి బోర్డు పూర్తి చేశారు. దీనికి 32,970 బొట్టుబిళ్లలు వినియోగించారు. 16,314 నారింజ, 3,192 బ్లూ, 13,464 ఆకుపచ్చ బొట్టుబిళ్లలతో జైశ్రీరామ్ బోర్డును అద్భుతంగా తీర్చిదిద్దారు. ప్రతిరూప కళాకారుడు డి.నాగేశ్వరరావు నుంచి ప్రేరణ పొంది రూపొందించినట్లు తెలిపారు. అయోధ్యకు వెళ్లి రామాలయం మ్యూజియంకు ఈ కళాఖండాన్ని అందజేస్తామని వారు తెలిపారు. ఇప్పటి తాను 220 రికార్డులు సాధించానని కాసుల పద్మావతి తెలిపారు.



జైశ్రీరామ్ బోర్డును అవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు


ఖాళీల వివరాలను చూపుతున్న బక్క జడ్సన్, పృథ్వీరాజ్, విఠల్, తదితరులు

ఉద్యోగాల భర్తీ ఎప్పుడు?

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్

పంజాగుట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామని, నేటికీ ఖాళీలు గుర్తించలేదని వరంగల్, నల్గొండ, ఖమ్మం నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్ ఆరోపించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు పృథ్వీరాజ్, విఠల్, తదితరులతో కలిసి 2023 డిసెంబర్ 31 నాటికి తెలంగాణలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాల పోస్టరును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ఏర్పడ్డ తెలంగాణలో నేటికీ అవి పూర్తి కాలేదన్నారు. 2014లో ఏర్పడ్డ తెలంగాణ, నీళ్లు, నిధులు, నియామకాల్లో వెనుకపడ్డదనేది వాస్తవమన్నారు. శాఖల వారీగా ఖాళీలు గుర్తించలేదన్నారు. తాను ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత ఖాళీలు భర్తీ అయ్యేంత వరకు పోరాటం చేస్తామన్నారు.

ఓటు వేయడానికి వెళ్లిన వృద్ధురాలు అదృశ్యం

కవాడిగూడ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఓటు వేయడానికి వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైంది. గాంధీనగర్ ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం డిజేబుల్ హోంలో ఉంటున్న పదిమంది గుజరాతీ భవన్‌లో పోలింగ్ బూత్‌లో ఓటు వేయడానికి వెళ్లారు. తొమ్మిదిమంది తిరిగి ఆశ్రమానికి వచ్చారు. లలిత (60) రాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో డిజేబుల్ హోం రిసెప్షన్ అములేరాజ్ గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూజ చేస్తుండగా మంటలంటుకొని వృద్ధురాలి మృతి

చాదర్‌ఘాట్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో పూజ చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలంటుకుని వృద్ధురాలు మృతి చెందింది. మలక్‌పేట ఎస్ఐ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం... మలక్‌పేట శ్రీపురం కాలనీలో నివసిస్తున్న వైవీకే రాజేశ్వరి (72) మంగళవారం ఉదయం పూజ చేస్తుండగా మంటలంటుకున్నాయి. పొరుగింటి వారు గమనించి బయటకు వెళ్లిన ఆమె భర్త భాస్కర రామారావుకు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే ఇంటికి చేరుకోగా.. అప్పటికే రాజేశ్వరి కాలిన గాయాలతో అపస్మారక స్థితిలో ఉంది. ఆస్పత్రికి తరలించడానికి 108 అంబులెన్స్‌ను రప్పించారు. అంబులెన్స్ సిబ్బంది పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మలక్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఢీకొని ఇద్దరి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 14 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాటసింగారం శివారు చాచా దాబా సమీపంలో విజయవాడ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి సోమవారం అర్ధరాత్రి రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వేగంగా వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి శరీరంపై నీలం రంగు చొక్కా, డార్క్ బ్లూకలర్ ప్యాంటు ఉన్నాయని పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712662650, 8712662293 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మరో ఘటనలో..

పసుమాముల కళానగర్‌కు చెందిన రెవెళ్ల జంగయ్య(40) ఆటో డ్రైవర్. మంగళవారం పని మీద అబ్దుల్లాపూర్‌మెట్ వెళ్లాడు. విజయవాడ జాతీయ రహదారిపై మయూరి కాంట వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైప వేగంగా వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం స్థానికంగాగల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మధ్యాహ్నం 3 గంటలకు మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో.. ఎంబీటీ అధికార ప్రతినిధికి తీవ్రగాయాలు

చాదర్‌ఘాట్: రోడ్డు ప్రమాదంలో ఎంబీటీ అధికార ప్రతినిధి తీవ్రంగా గాయపడ్డాడు. మలక్‌పేట యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బంధువు మృతిచెందడంతో ఎంబీటీ అధికార ప్రతినిధి మంగళవారం ద్విచక్రవాహనంపై ఆస్పత్రికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా చంచల్‌గూడ జైలు వద్ద నిర్మాణంలో ఉన్న స్టీల్ బ్రిడ్జి వద్ద ఇనుపరాడ్ తగలడంతో అదుపు తప్పి కిందపడిపోవడంతో తలకు, కుడి చేతికి తీవ్రమైన గాయాలయ్యాయి. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

రద్దీలేని వేళల్లో రాయితీ ఎందుకు?

- కాంటాక్ట్ లెస్ కార్డ్స్‌పై ప్రయాణికుల పెదవి విరుపు
- నాన్ పీక్ అవర్స్‌లో ఆఫర్‌ను అమలు చేయడంపై విమర్శలు
- 10 శాతం మంది కూడా వినియోగించుకోని పరిస్థితి

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైళ్లలో రాయితీలను నామమాత్రంగానే అమలు చేస్తున్నారు. పేరు కోసం కొన్ని డిస్కౌంట్లను ప్రకటిస్తున్నప్పటికీ.. అవి అందరికీ ఉపయోగపడని పరిస్థితి నెలకొంది. దీంతో ఎల్‌అండ్ టీ అధికారుల తీరుపై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. అన్ని వేళల్లో కొనసాగించాల్సిన రాయితీలను కొన్ని గంటల వరకే పరిమితం చేయడంపై విమర్శిస్తున్నారు. మెట్రో రైళ్లలో ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. మూడు నెలల క్రితం రోజుకు 4.50 లక్షల మంది ప్రయాణించగా.. నెలన్నర రోజులుగా 4.80 లక్షల నుంచి 5.10 లక్షల మంది గరిష్ఠంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో రైల్వేస్టేషన్లు, రైళ్లలో ఎప్పుడు చూసినా రద్దీ కనిపిస్తోంది. రద్దీకి అనుగుణంగా అధికారులు 3 నిమిషాలకోసారి రైళ్లను నడిపిస్తున్నారు. ప్రయాణికులు పెరుగుతున్నప్పటికీ.. వీలైనన్ని ఎక్కువ ఆఫర్లను అందుబాటులోకి తీసుకురావాల్సిన ఎల్‌అండ్‌టీ.. ఉన్న వాటిని కూడా పూర్తిస్థాయిలో అందించకపోతుండడంతో నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

ఉపయోగపడని కాంటాక్ట్ లెస్ కార్డ్స్

పెరుగుతున్న ప్రయాణికులను ఆకట్టుకునేందుకు ఎల్‌అండ్‌టీ సంస్థ పలు రకాల ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా స్మార్ట్‌కార్డు, సూపర్ సేవర్ ఆఫర్(ఎస్‌ఎస్‌ఓ)- 59 డిస్కౌంట్, కాంటాక్ట్ లెస్ కార్డ్(సీఎస్‌సీ) కార్డులను ప్రవేశపెట్టింది. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి 11 గంటల వరకు(నాన్ పీక్ అవర్స్‌లో) కాంటాక్ట్ లెస్ కార్డుల ద్వారా చేసే బుకింగ్స్‌పై 10 శాతం రాయితీ అందిస్తున్నారు. సదరు ఆఫర్‌ను కేవలం 10 శాతం మంది మాత్రమే వినియోగిస్తుండగా.. 90 శాతం మంది దూరంగా ఉంటున్న పరిస్థితి కనిపిస్తోంది. పీక్ అవర్స్(ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకు)లో కాంటాక్ట్ లెస్ కార్డులను అమలుచేస్తే అందరికీ ప్రయోజనం ఉంటుందని, రద్దీ లేని సమయంలో రాయితీ ఇవ్వడం ద్వారా ఎవరికీ ఉపయోగం ఉండదని ప్రయాణికులు వాపోతున్నారు.

పీక్ అవర్స్‌లోనూ కొనసాగించాలి

పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని పీక్ అవర్స్‌లోనూ ఆఫర్లను కొనసాగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రధానంగా 10 శాతం రాయితీతో కూడిన కాంటాక్ట్ లెస్ కార్డులను అన్నివేళల్లో అమలు చేయడం ద్వారా చాలామంది వినియోగించుకుంటారని చెబుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సూపర్ సేవర్-59, స్మార్ట్ కార్డు, కాంటాక్ట్ లెస్ కార్డుపై 10 శాతం, డిజిటల్ క్యూఆర్ టికెట్స్‌పై ఉన్న 10 శాతం రాయితీ ఎత్తివేయడంతో ప్రయాణికుల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. మే 1 నుంచి ఆయా ఆఫర్లను కొనసాగిస్తామని అధికారులు ప్రకటించడం గమనార్హం.